క్లుప్తంగా

సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పణ

కవిటి: రాజపురంలో వెలసిన కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారిని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా చేయనున్న ఉత్సవానికి తనవంతుగా పట్టువస్త్రాల్ని సమర్పించారు. ఈ మేరకు ఆలయ అర్చకస్వామి మోహన్ ఆచార్యులు వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక సర్పంచ్ సనపల జానకీరావు, ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని ఐసీడీఎస్ సీడీపీవో నాగరాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి కావడంతో చిన్నారులను ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంచాలని సూచించారు. మే నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు, మే 16 నుంచి 30వ తేదీ వరకు హెల్పర్లకు వెసవలి సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిందని పేర్కొన్నారు.

విద్యార్థులకు సత్కారం



మేఘన మహారణను సత్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు తదితరులు

కాశీబుగ్గ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన మార్కులతో రాణించారు. ఈ పాఠశాల నుంచి 250 మంది పరీక్షకు హాజరవ్వగా 211 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో మెరుగైన మార్కులను సాధించిన విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు బుధవారం వెళ్లి సత్కరించారు. మేఘన మహారాణ-592, మౌనిక పాత్రో-589, దీర్ఘాశి రాకేష్- 587 మార్కులు సాధించగా వారి తల్లిదండ్రులతో కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే 550 మార్కులు దాటిన 26 మందికి, 500 మార్కులు దాటిన 62 మంది విద్యార్థుల ఇళ్లకు కూడా ఉపాధ్యాయులు వెళ్లి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాట్ల దాశరథి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తమ్మినాన చిట్టిబాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే అధిక మార్కులు సాధించిన మేఘన మహారణను మందస జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం వచ్చిన జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.

వృత్తి విద్యా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

కంచిలి: మకరం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న వృత్తి విద్యా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల విద్యార్థుల వృత్తి విద్య కోర్సులలో భాగంగా లెవల్-2 (పదవ తరగతి), లెవెల్-4 (ఇంటర్) విద్యార్థులకు ఐటీ విభాగంలో ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌లో తర్ఫీదు పొందినందుకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. వీరికి స్థానిక ఎస్.కె.డిజిటల్స్, మీసేవ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ప్రైమరీ హెల్త్ సెంటర్, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లలో 12 రోజుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ మాట్లాడుతూ.. ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పొందవచ్చునన్నారు. ఐటి ఒకేషనల్ ట్రైనర్ సత్యనారాయణను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మంగారి ఆలయ ప్రతిష్ట

కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఎల్సీ గేట్ సమీపంలో నిర్మించిన విరాట్ పోతులూరి గోవిందామ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం జరిగింది. కాశీబుగ్గ శ్రీకంచి కామాక్షి స్వర్ణకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు పూజా కార్యక్రమాలు జరుగుతాయి. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.



టెక్కలి బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

పులకించిన టెక్కలి

- విజయవంతమైన 'మేమంతా సిద్ధం' ముగింపు సభ
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపిన సీఎం జగన్ ప్రసంగం

టెక్కలి/నందిగాం/టెక్కలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో టెక్కలి పులకించింది. అన్న అడుగుపెట్టిన వేళ...మేఘాలన్నీ కారు మబ్బులు కమ్ముతూ చల్లటి వాతావరణంతో దీవించాయి. అప్పటి వరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరిగా ఉన్న జనాలకు చల్లబడిన వాతావరణం ఊరటనిచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ముగింపు కార్యక్రమం బుధవారం టెక్కలిలో నిర్వహించారు. అక్కవరం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభా వేదిక వద్దకు సాయంత్రం 4.15 గంటలకు సీఎం జగన్ చేరుకున్నారు. అప్పటి వరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్క సారిగా మేఘావృతమై చల్లబడింది. జగనన్న వేదికపైకి చేరుకోవడంతో వేదిక ముందున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలంతా చేసిన జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. సీఎం జగన్ వేదిక నుంచి ర్యాంప్ మీదుగా నడుస్తూ ప్రజలందరికీ అభివాదం చేశారు. ఆయనను చూసేందుకు టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. సభా ప్రాంగణం నుంచి జాతీయ రహదారి వరకు పెద్ద ఎత్తున జనాలు చేరడంతో టెక్కలి ప్రాంతం జన జాతరగా మారింది. గడచిన వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్న వారంతా మేమంతా సిద్ధం సభకు హాజరై తమ అభిమానాన్ని చాటుకున్నారు. బాబు లాంటి మోసగాడు కావాలా అని జగన్ అనడంతో వద్దు.. వద్దు అంటూ ప్రజలు బదులిచ్చారు. జగన్ ప్రసంగం ఆరంభించినప్పటి నుంచి మరళా హెలికాప్టర్‌లో పయనమైనంత వర కు ప్రజలంతా సభా వేదిక ప్రాంగణంలోనే ఉన్నా రు. సభ వేదిక ముందు ఎంత మంది జనాలు ఉన్నారో బయట అంతే జనాలు ఉండడం గమనార్హం. సీఎం సభ విజయవంతం కావడంతో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సరికొత్త జోష్ కనిపించింది. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, పాల వసంత రెడ్డి, పేరాడ భార్గవి, దుబ్బ వెంకట్రావు, ఎంపీపీలు ఎ.సరోజనమ్మ, ఎన్.శ్రీరామ్మూర్తి, మేరుగు రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షు లు కె.అజయ్, కె.సతీష్, టి.ఫాల్గుణరావు, ఎన్.సత్యరాజ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఎస్.సత్యం, కె.జగన్నాయకులు, బి.మధు, బి.మురళి, జేసీఎస్ ఇన్ చార్జిలు ఎస్.మోహన్, జె.జయరాం, జి.నాగు, ఎం.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన దువ్వాడ వాణి



టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల సమీపంలో అక్కివలస వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమెతో పాటు మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కవిటి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో చేపట్టిన బస్సు యాత్ర కోసం ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస వద్ద సీఎం జగన్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

ఇచ్ఛాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యాదవ కుల పెద్ద, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఎన్నికల్లో యాదవ సామాజికవర్గమంతా వైస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేలా చూడాలని సీఎం సూచించారు.



సీఎం జగన్‌తో నరేంద్రయాదవ్

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సంతు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసేందుకు కృషి చేయాలని చైర్‌పర్సన్ దంపతులకు సీఎం జగన్ సూచించారు.



సీఎం జగన్‌తో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి, సంతు దంపతులు

గట్లపాడు వద్ద సీఎం జగన్‌కు ఘనస్వాగతం



కోటబొమ్మాళి: జియ్యన్నపేట వద్ద స్వాగతం పలికేందుకు వచ్చిన కొత్తపల్లి మహిళలు



నందిగాం: పార్టీ జెండాను, జగనన్న ఫొటోను చొక్కాగా కుట్టించుకున్న యువకుడు

కోటబొమ్మాళి: టెక్కలిలో బుధవారం నిర్వహించిన సిద్ధం సభకు బస్సు యాత్రగా వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కోటబొమ్మాళి మండలం ప్రవేశ వద్ద ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. నరసన్నపేట మండలంలో బస్ యాత్ర ముగిసి కోటబొమ్మాళి మండలం గట్లపాడు గ్రామం వద్ద యాత్ర ప్రవేశించగానే.. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, శ్రీజగన్నాథపురం, హరిశ్చంద్రపురం, పాడుగుపాడు, జర్జంగి, మహసాహెబ్‌పేట, నీలంపేట, గంగరాం, లఖందిడ్డి, ఎత్తురాళ్లపాడు, కస్తూరిపాడు, ఎండపేట, కొత్తపల్లి, దంత, పాకివలస, జియ్యన్నపేట, కొత్తపేట, పరసురాంపురం గ్రామాల నుంచి భారీగా జనం జాతీయ రహదారి దగ్గరకు తరలివచ్చి అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు.

బస్‌లో నుంచి సీఎం జగన్ చేయిఊపుతూ వారికి అభివాదం చేస్తూ ముదుకుసాగారు. పరసురాంపురం వద్ద కోటబొమ్మాళి మండలానికి చెందిన సీఎం అభిమానులు 25 అడుగుల ఎత్తుగల భారీ పుస్తకాలు, సంక్షేమ పథకాల స్టిక్కర్లతో తయారు చేసిన గజమాలను క్రేన్‌తో జగన్‌కు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అడుగులన్నీ టెక్కలి వైపే..

టెక్కలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన 'సిద్ధం' సభకు పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. అందరి అడుగులు టెక్కలి వైపే పడ్డాయి. దారి పొడవునా జై జగన్.. జైజై జగన్ నినాదాలు హోరెత్తాయి. యువకులు బైక్ ర్యాలీలు చేపట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ అభిమాన నేత సీఎం జగన్‌ను చూసేందుకు ఆసక్తి చూపారు. – సోంపేట, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు రూరల్



కాశీబుగ్గ: మున్సిపాలిటీ వార్డులో బల్లయ్య ఆధ్వర్యంలో సిద్ధం సభకు వెళ్తున్న ముస్లింలు



సోంపేట నుంచి టెక్కలి వెళ్తున్న జగనన్న సైన్యం



వజ్రపుకొత్తూరు రూరల్: కొండపూరు యువకులు

జన స్పందన

జగన్ మళ్లీ గెలుస్తారు



మా లాంటి వృద్ధుల దీవెనలతో జగన్ మళ్లీ గెలుస్తారు. నాకు ఇంటికి తెచ్చి పింఛన్ ఇస్తున్నారు. జగన్‌కే నా ఓటు వేస్తాను. జగన్ వస్తున్నారని తెలిసి సంతబొమ్మాళి మండలం బోరుభద్ర నుంచి వచ్చాను.

–మద్ది లచ్చమ్మ, బోరుభద్ర, సంతబొమ్మాళి మండలం

జగన్‌కే నా ఓటు



రైతు భరోసా ఇచ్చి మా లాంటి రైతుల్ని ఆదుకుంటున్న జగన్‌కే నా ఓటు వేస్తాను. మా ఇంట్లో రైతు భరోసా, పింఛన్‌తో పాటు ఇంటికే వచ్చి రేషన్ ఇస్తున్నారు. –హనుమంతు రామజోగి, అక్కివలస, సారవకోట మండలం

రెండోసారి వచ్చాను



మూలపేట పోర్టు శంకుస్థాపన కోసం సీఎం వైఎస్ జగన్ వచ్చినపుడు అక్కడకు వెళ్లాను. ఇప్పుడు టెక్కలి వస్తున్నారని తెలిసి ఇక్కడకు వచ్చాను. ప్రతీ నెలా మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. జగన్ రుణం తీర్చుకోవడానికి మళ్లీ సీఎంను చేస్తాం.

–కోట జయప్రభ, కోటవానిపేట, సంతబొమ్మాళి మండలం

మా దైవం జగన్..



మా దైవం జగన్. ఆయనే మళ్లీ సీఎం అవుతారు. ఐదేళ్లలో మా కుటుంబానికి అన్నివిధాలుగా లబ్ధి చేకూరింది. పిల్లలకు అమ్మఒడి డబ్బులు వచ్చాయి.

–కంచరాన ఝాన్సీ, నందిగాం మండలం బడగాం

పేదల దేవుడు



సీఎం జగన్ పేదల దేవుడు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి మాకు ఎంతో మేలుచేశారు. సంక్షేమ పథకాలతో అందరి ఇళ్లలో వెలుగులు నింపారు. జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటాం

– జి.సిమ్మమ్మ, కిష్టుపురం, కోటబొమ్మాళి మండలం

సేవ చేసే భాగ్యం కల్పించారు



కరోనా వంటి కష్టకాలంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం మాలాంటి వారికి కల్పించారు. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు సీఎం జగన్ ఎంతోమేలు చేశారు. మమ్మల్ని సైతం ఉన్నత స్థానంలో నిలబెట్టారు.

– మద్దిమంజుల, మాజీ వలంటీర్, అక్కుపల్లి, పలాస మండలం

గుర్తింపును ఇచ్చారు



పేదవాడికి సాయం చేయాలన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో మమ్మల్ని భాగస్వామ్యం చేసి సంఘంలో మాకొక గుర్తించి నిచ్చారు. జగనన్న చెప్పిన ప్రకారం రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వాళ్ల ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందించాం.

–కణితి షర్మిల, రాజీనామా చేసిన వలంటీరు, హరిదాసుపురం, నందిగాం మండలం

అన్ని పథకాలు వర్తించాయి



ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన దేవుడు జగనన్న. మా కుటుంబానికి జగనన్న ఇల్లు, అమ్మాయికు ఫీజురీయింబర్‌మెంట్, అబ్బాయికి అమ్మఒడి, భార్యకు నాలుగ విడతల్లో డ్వాక్రా రుణమాఫీ, రాదనుకున్న అగ్రిగోల్డ్ సొమ్ములు అందజేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– గేదెల వెంకటరాజు, నౌపడ, సంతబొమ్మాళి

సంక్షేమాన్ని చూసి ఓటేయండి

- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనాకాలంలో జరిగిన అభివృద్ధిని చూసి మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ కోరారు. మండలంలోని రాజపురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులతో బుధవారం మాట్లాడారు. కరోనావంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి ఎటువంటిలోటు రానీయకుండా సంక్షేమ పథకాల్ని కొనసాగించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండల పార్టీ కన్వీనర్ కె.ప్రకాష్, వై.నీలయ్య, ఎన్ని అశోక్, సనపల జానకీరావు, సనపల కృష్ణారావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని గెలిపించండి

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర సంక్షేమ సారథి, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. తులసిగాం పంచాయతీలో మండల నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి వేతనదారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఇసురు తులసీరాం, ఇసురు యాదవరెడ్డి, మరడ వలసయ్య, ఆశి కృష్ణారెడ్డి, ఇసురు పరుశురాం, పటాన శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



కవిటి: వేతనదారులతో మాట్లాడుతున్న పిరియా విజయ

నేడు మున్సిపాలిటీలో మంత్రి ప్రచారం

కాశీబుగ్గ: పలాస అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయన క్యాంప్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన పలువురు టీడీపీ అభిమానులు, సేవా సంఘ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేశారు. పలాసలోని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగృహంలో చేరిక కార్యక్రమం బుధవారం జరిగింది. పలాస- కాశీబుగ్గ జంట పట్టణాలలో ఉన్న తెలగ సంఘం అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు పుట్టా లోకనాథం, రట్టి పాపారావు, ఎచ్చెర్ల నాగభూషణం, వై.శ్యామలరావు తదితరులు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గుజ్జు జోగారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, రోణంకి శ్రీనివాసరావు ఉన్నారు.



కాశీబుగ్గ: పార్టీలో చేరిన వారితో మంత్రి సీదిరి అప్పలరాజు

తర్లాకోట నుంచి...

పలాస: తర్లాకోట గ్రామానికి చెందిన 70 మంది టీడీపీ అభిమానులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యార్లగడ్డ ఆగడాలు ఇక్కడ చెల్లవని, గత ఐదేళ్లలో మంత్రి అప్పలరాజు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని..వాటికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో సంధ్య, రేణుక, భాను, దమయంతి, కుంతీ, నందిని, భాస్కర్, కామేశ్వర్, రాజేష్, పెద్దడిల్లీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ల శివకృష్ణ, చిత్తరంజన్‌నాయక్, బుదియా, కలియా బెహరా తదితరులు పాల్గొన్నారు.



పలాస: వైఎస్సార్‌సీపీలో చేరిన తర్లాకోట గ్రామస్తులు

ఆశ్రమంలో చేరిన గిరిజన బాలబాలికలు

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన 35 మంది గిరిజన బాలబాలికలను చేర్చుకొన్నారు. ఈ చిన్నారులు నాగరికతకు దూరంగా జీవనం సాగిస్తున్నటివంటి నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందినవారు. పాఠశాల విద్యకు, పౌష్టిక ఆహారానికి నోచుకోక మౌలిక వసతులకు దూరంగా ఉండేవారు. వీరి పరిస్థితిని తెలుసుకున్న ఆశ్రమ నిర్వాహకులు వారిని ఆశ్రమంలో చేర్పించుకున్నారు. ఆశ్రయం పొందిన చిన్నారులు ఒడిషా గజపతి జిల్లా కిడింబా, దొమాదువ, కంబేరింగ్ ముక్తినగర్, డెంగిలి, శిక్కాబడి, రజ్మా, గుచ్ఛగూడ గిరిజన గ్రామాలకు చెందిన వారని సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్ తెలిపారు. చిన్నారులను కంచిలి మండలంలోని తలతంపర ఒడి యా పాఠశాల, కవిటి మండలం మాణిక్యపురం ఒడియా పాఠశాలల్లో చేర్పించడానికి ఏర్పాట్లు చేశా రు. పిల్లలకు ఒడియా పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఉత్తరాంధ్ర ఒడియా డి.ఐ. దుర్గాప్రసద్ చౌదరి, మండల విద్యాశాఖాధికారి కె.చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామహరి పాఢి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి పాల్గొన్నారు.